

చొప్పదండి: పట్టణంలో మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, అధికారులు



చొప్పదండి: కొలిమికుంటలో మొక్క నాటుతున్న సర్పంచ్, తదితరులు

# ఊరూరా హరితోత్సవం

- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు
- మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు



రామడుగు: మండల కేంద్రంలో ఉపాధిహామీ కూలీలతో కలిసి మొక్క నాటుతున్న ఎంపీపీ కలిగేటి కవిత-లక్ష్మణ్

చొప్పదండి, జూన్ 19: తెలంగాణ రాష్ట్రాన్ని హరితమయంగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, జడ్పీటీసీ మాచర్ల సౌజన్య-వినయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం చొప్పదండిలోని 6వ వార్డులో, గుమ్లాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద, రేవెల్లి, దేశాయ్‌పేట, చిట్యాలపల్లి గ్రామాల్లో నిర్వహించిన హరితోత్సవంలో వారు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రాన్ని హరితమయంగా మార్చాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం ప్రవేశపెట్టారని కొనియాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన కృషితోనే వర్షాలు సకాలంలో కురుసి నీటి సమస్య తీరిందన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కౌన్సిలర్ల ఫోరం జిల్లా అధ్యక్షుడు వడ్లూరి గంగరాజు, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, కమిషనర్ శాంతి కుమార్, తహసీల్దార్ రజిత, ఎంపీడీవో స్వరూప, కౌన్సిలర్లు కొత్తూరి మహేశ్, మాడూరి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు తాళ్లపల్లి సుజాత-శ్రీనివాస్‌గౌడ్, కొత్తూరి లింగమ్మ, గుంట రవి, సురేశ్, నాయకులు చేగంటి రవి, కొత్తూరి నరేశ్, దండె కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గంగాధర, జూన్ 19: మండలంలోని 33 గ్రామాల్లో హరితోత్సవంలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, విద్యార్థులు విరివిగా మొక్కలు నాటారు. గ్రామాల్లో నర్సరీలను పరిశీలించి గ్రామస్తులకు మొక్కలు అందజేశారు. నర్సరీల వద్ద తెలంగాణ హరితహారం పేరుతో ముగ్గులు వేసి అందంగా అలంకరించారు. నర్సరీల్లో మొక్కలను సంరక్షిస్తున్న వన సేవకులను సన్మానించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, నాయకులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, ఉపాధిహామీ సిబ్బంది, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగాధర, జూన్ 19: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎస్‌ఐ అభిలాష్ కోరారు. గంగాధర పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ స్ఫూర్తితో ప్రజలు మొక్కలు నాటి సంరక్షిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రామడుగు, జూన్ 19: హరితహారం కార్యక్రమం పల్లెల రూపురేఖలనే మార్చివేసిందని ఎంపీపీ కలిగేటి కవిత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ ఆవరణలో సర్పంచ్ పంజాల ప్రమీల-జగన్‌మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన హరితోత్సవం కార్యక్రమానికి ఎంపీపీ కలిగేటి కవిత హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, అంతరించిపోతున్న అడవుల రక్షణకు తెలంగాణ ప్రభుత్వం హరితహారం కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మోడల్‌స్కూల్ పరిసరాల్లో డ్రాగన్ మొక్కలు నాటారు. వెలిచాలలో సర్పంచ్ వీర్ల సరోజన అధికారులు, పంచాయతీ పాలక వర్గ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ పంజాల ప్రమీల-జగన్‌మోహన్ గౌడ్, వైస్ ఎంపీపీ పూరెల్ల గోపాల్‌గౌడ్, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి, ఏపీవో రాధ, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ వనజ, ఉపాధిహామీ కూలీలు, వెలిచాలలో ఉప సర్పంచ్ పూదరి వెంకటేశ్, మాజీ సర్పంచ్ వీర్ల రవీందర్‌రావు, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, వార్డు సభ్యులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గంగాధర : తాడిజెర్రిలో మొక్క నాటుతున్న వీడీసీ చైర్మన్ సురేందర్



గంగాధన : గట్టుభూత్కూర్‌లో మొక్కలు నాటుతున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్, తదితరులు



గంగాధర: గట్టుభూత్కూర్‌లో హరితోత్సవంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, మహిళలు



గంగాధర : కొండన్నపల్లిలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ జమున, గ్రామస్తులు



చొప్పదండి: చిట్యాలపల్లిలో మొక్కలు నాటుతున్న జడ్పీటీసీ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు



గంగాధర : కోట్లనర్సింహులపల్లిలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ కవిత, తదితరులు



గంగాధర: కురిక్యాలలో మొక్కనాటి సెల్ఫీ దిగుతున్న సర్పంచ్ నవీన్‌రావు

## నియామకం

కొత్తపల్లి, జూన్ 19: తెలంగాణ స్టేట్ రెడ్డి యూత్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా వోరం అనిల్ రెడ్డిని నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి అశోక్‌రెడ్డి ఉత్తర్వులు విడుదల చేశారు. ఈమేరకు సోమవారం నగరంలోని కోర్టు సమీపంలో గల సంఘం ఉత్తర తెలంగాణ కార్యాలయంలో అనిల్ రెడ్డికి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల సుదర్శన్‌రెడ్డి, నాయకులు కాల్వ పూర్ణచందర్‌రెడ్డి, చింతలపల్లి సంజీవరెడ్డి, రామకృష్ణారెడ్డి, కాంతాల తిరుపతిరెడ్డి, మల్లారెడ్డి, చేపూరి సదాశివరెడ్డి, భూపతి చెన్నారెడ్డి, వర్ణ పెద్దిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి కేసీఆర్ ప్రాధాన్యం

కార్పొరేషన్, జూన్ 19: పట్టణాలు, నగరాల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యమిస్తున్నారని 3వ డివిజన్ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులకు సోమవారం ఆయన సబ్బులు, కొబ్బరి నూనె, గ్లౌసులు, బూట్లు, మాస్కులు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం కార్మికుల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఎస్‌యూకు వసతి గృహాలు మంజూరు



ఒప్పంద పత్రాలు అందుకుంటున్న ఎస్‌యూ రిజిస్ట్రార్ వరప్రసాద్

కమాన్‌చౌరస్తా, జూన్ 19: శాతవాహన విశ్వవిద్యాలయానికి బాలుర, బాలికల వసతి గృహాలు మంజూరైనట్లు ఉపకుపలపతి ఆచార్య మల్లేశ్ సంకసాల పేర్కొన్నారు. ఈ హాస్టల్స్ కేవలం గిరిజన పేద విద్యార్థులకు మాత్రమే అందుబాటులో ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ఎస్‌యూ మధ్య వసతి గృహాల నిర్మాణానికి సంబంధించి ఒప్పందం జరిగిందన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ సెక్రటరీ, కమిషనర్ క్రిస్టినా జెడ్ చోంగూ, ఎస్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం వరప్రసాద్ ఈ ఒప్పంద పత్రాలు (ఎంవోయూ) మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, సెక్రటరీ, కమిషనర్ క్రిస్టినా జెడ్ చోంగూ, చీఫ్ ఇంజినీర్ శంకర్, ఏఈ వినోద్ పాల్గొన్నారు.

## ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్వీ కర్ణన్

కమాన్‌చౌరస్తా, జూన్ 19: ప్రభుత్వం ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిందని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ పేర్కొన్నారు. జిల్లా కేం ద్రంలోని ధన్గర్‌వాడీ పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రారంభించనున్న ఇంటరాక్టివ్ ప్యానెళ్ల పని తీరును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మన ఊరు మన బడి ద్వారా ప్రభుత్వం సర్కారు బడుల్లో వసతులను మెరుగు పరిచిందన్నారు. నైపుణ్యం కలిగిన టీచర్లను నియ మించిందని చెప్పారు. విద్యార్థులు వినియోగించుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. డీఈవో జనార్దన్ రావు, ఎంఈవో మధుసూదన్ పాల్గొన్నారు.

## వృద్ధురాలి హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కోర్టుచౌరస్తా, జూన్ 19: వృద్ధురాలిపై లైంగిక దాడి చేయడంతో పాటు హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ సోమవారం కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జి శ్రీవాణి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... మానకొండూర్ మండలం నిజాయితీగూడెం గ్రామానికి చెందిన గడ్డి కనకవ్వ (65) ఇంట్లో ఒంటరిగా ఉండగా 2016 సెప్టెంబర్ 10న అదే గ్రామానికి చెందిన కాల్వ రాజు(26) అనే యువకుడు రాత్రి ఇంట్లోకి ప్రవేశించి లైంగిక దాడి చేసి గొంతు నులిమి హత్య చేశాడు. ఈ క్రమంలో ఏమి తెలియనట్లు కాల్వ శ్రీనివాస్, కాల్వ కొమురమ్మల సహకారంతో మృతురాలి ఒంటిపై దుప్పటి కప్పి వెళ్లిపోయారు. స్థానికులు కనకవ్వ బయటకు రాకపోవడం, ఎన్ని సార్లు పిలిచినా పలుకకపోవడంతో కోడలికి సమాచారం అందించారు. మృతురాలి కోడలు గడ్డి స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు మానకొండూర్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు ప్రాసిక్యూషన్ పక్షాన కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి శ్రీవాణి నిందితుడు కాల్వ రాజుకు జీవితఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా, మరో నిందితులు కాల్వ శ్రీనివాస్, కాల్వ కొమురమ్మకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించారు.